సాక్షి అనకాపల్లి

ఆదివారం । 2 । జూన్ । 2024



సిరులతల్లికి తులసీదళార్చన

బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. 8లో



కమనీయం.. కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు, నిత్య కల్యాణం వైభవంగా జరిగాయి. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.0/23.5

వాతావరణం

ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శనివారం తెలిపారు.

శ్రీ ఆంజనేయం శిరసా నమామి..



అనకాపల్లి రింగ్ రోడ్డు ఆంజనేయ ఆలయంలో జీడిపప్పు, బాదంపప్పుతో అలంకరణ

జిల్లా లోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

మళ్లీ 'టోల్' బాదుడు

- ప్రస్తుత చార్జీలపై 5 శాతం పెంపు
- నేటి అర్ధరాత్రి నుంచి అమల్లోకి..
- ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నుంచి నిలిచిన చార్జీల పెంపు
- తుది దశ పోలింగ్ ముగియడంతో వడ్డనకు శ్రీకారం



అగనంపూడి టోల్ ప్లాజా

సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే వాహన యజమానులకు భారంగా మారిన టోల్‌గేట్ చార్జీలు మరింత భారం కానున్నాయి. ప్రస్తుత చార్జీలకు ఐదు శాతం అదనంగా పెరగనున్నాయి. ఇవి ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి రానున్నాయి. టోల్‌గేట్‌ల ఫీజును వసూలు కాంట్రాక్టును దక్కించుకున్న వ్యక్తి/సంస్థ ఏటా టోల్‌గేట్ రేట్లను పెంచుకోవడానికి అనుమతిస్తారు. ఇందుకు సంబంధిత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచిన టోల్ ఫీజును వసూలు చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అన్ని దశలు ముగిసే వరకు పెంపు అమలును నిలిపి వేశారు. జూన్ ఒకటో తేదీతో తుది దశ పోలింగ్ పూర్తయింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి (జూన్ 2వ తేదీ) నుంచి పెంచిన టోల్ ఫీజు చార్జీలను వసూలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా టోల్ ప్లాజాల నిర్వాహకులకు ఎన్‌హెచ్ఏఐ అధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. నిబంధనల ప్రకారం ప్రస్తుత చార్జీలపై ఐదు శాతం టోల్ ఫీజును పెంచారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అగనంపూడి, వేంపాడు టోల్ ప్లాజాలున్నాయి. వీటిలో అగనంపూడి టోల్ ప్లాజాలో మాత్రం కార్లు, జీపులు, వ్యాన్లకు టోల్ ఫీజులు పెరగలేదు. అక్కడ ఈ వాహనాలకు ఒక వైపు రూ.65, రానుపోను రూ.95 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇకపై కూడా వీటికి ఇవే చార్జీలు వసూలు చేయనున్నారు. ఇది ఈ టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగించే కార్లు, జీపులు, వ్యాన్లకు కాస్త ఊరటనివ్వనుంది. మిగిలిన వాహనాలకు కనీసం రూ.5 నుంచి రూ15 వరకు పెంచారు. అలాగే వేంపాడు టోల్ ప్లాజాలో కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వాహనాల (ఎల్ఎంవీ)కు ప్రస్తుతం ఒక వైపు రూ.135 వసూలు చేస్తుండగా ఇకపై రూ.140, రానుపోను రూ.200 నుంచి రూ.210కి పెంపుదల చేశారు. ఇంకా మిగిలిన వాహనాలపై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచారు. పెరిగిన టోల్ ఫీజులను శనివారం నుంచే ఆయా ప్లాజాల్లో బోర్డుల్లో ప్రదర్శనకు ఉంచారు.

వేంపాడు టోల్ ప్లాజాలో ఇలా
(బ్రాకెట్లలో పాత చార్జీలు రూ.లలో)

వాహనం వివరం	సింగిల్	రానుపోను
కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికల్	రూ.140 (135)	రూ.210 (200)
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికల్/మినీ బస్సు	రూ.225 (220)	రూ.335 (325)
బస్సు/ట్రక్కు	రూ.470 (455)	7రూ.00 (685)
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.510 (500)	రూ.765 (745)
భారీ వాహనం (7+ యాక్సిల్స్)	రూ.895 (870)	రూ.1340 (1310)
అగనంపూడి టోల్ ప్లాజాలో ఇలా..		
కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వెహికల్	రూ.65 (65)	రూ.95 (95)
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికల్/మినీ బస్సు	రూ.105 (100)	రూ.155 (155)
బస్సు/ట్రక్కు	రూ.220 (215)	రూ.330 (320)
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.240 (235)	రూ.360 (350)
భారీ వాహనం (7+ యాక్సిల్)	రూ.420(410)	రూ.625 (610)

ఘర్షణలకు పాల్పడితే రౌడీషీట్



ఎస్పీ మురళీకృష్ణ

- డ్రోన్, బాడీ ఓర్న్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ద్వారా గుర్తింపు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 500 మందికి పైగా పోలీసులతో బందోబస్తు
- 104 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్, పెట్రోలింగ్
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలు
- కౌంటింగ్ కేంద్రం సమీపంలో రెండు కిలోమీటర్ల వరకూ రెడ్ జోన్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే అలాంటి వారిని సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్, బాడీ ఓర్న్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా గుర్తించి రౌడీషీట్ తెరుస్తామని ఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. అదుపు తప్పిన మూకలపై బాష్ప వాయువు ప్రయోగించడం, లాఠీచార్జి చేయడానికి కూడా వెనుకాడేది లేదన్నారు. కౌంటింగ్ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు పాటించాల్సిన నిబంధనలను శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. జూన్ 4న కౌంటింగ్ కోసం శంకరం వద్ద ఏర్పాటు చేసిన ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ సమీపంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలకు పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవరికీ అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 500 మందికి పైగా పోలీస్ ఆఫీసర్స్, సిబ్బందితోపాటు కేంద్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలో రెండు కిలోమీటర్ల వరకూ రెడ్ జోన్‌గా ప్రకటించామని, అక్కడ ఎవ్వరూ డ్రోన్‌లు ఎగరవేయకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని 104 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్ టీంలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పార్టీలు, క్యూఆర్ టీమ్‌లను, స్పెషల్ పార్టీ టీమ్‌లను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీ కార్యాలయాల వద్ద, ప్రధాన పార్టీ అభ్యర్థుల ఇళ్ల వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్, అనంతరం ఫలితాలు ఎవరికి అనుకూలంగా వచ్చినా అత్యుత్సాహంతో అవాంఛనీయమైన సంఘటనలకు పాల్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.

ఏజెంట్లు నిబంధనలు పాటించాల్సిందే..

- ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు మొబైల్స్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు, పెన్ లేదా పేపర్ (ఆర్ ఓ అనుమతించిన పేపర్లకు మినహాయింపు) ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురాకూడదని సూచించారు.
- ఏజెంట్లు ఒక్కసారి కేంద్రం లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ పూర్తయ్యే వరకు బయటకు రావడానికి వీలు లేదని.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే ముందుగానే వాటికి సంబంధించిన మందులు తెచ్చుకోవాలని సూచించారు.
- ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చుటకు అనుమతి లేదని... టపాసులు, ఇతర పేలుడు పదార్థాలను నిల్వ చేయరాదని సూచించారు.
- ఏజెంట్లు మినహా మిగిలిన వారు ఎవరూ మండలం, నియోజకవర్గ, జిల్లా కేంద్రానికి, కౌంటింగ్ కేంద్రానికి రాకూడదన్నారు.
- సోషల్ మీడియాలో వచ్చే ఊహాజనిత వార్తలు నమ్మి స్పందించొద్దని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు పెట్టి గొడవలకు కారణమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌంటింగ్ రోజున ట్రాఫిక్ ఆంక్షలు

- జాతీయ రహదారి, సుంకరమెట్ట జంక్షన్, బొజ్జన్న కొండ రోడ్డు వైపు కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వారు రేబాక అండర్ పాస్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ ఆర్చ్ నుంచి రావాలి. ఈ రూట్‌లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు, మీడియా మిత్రులకు మాత్రమే అనుమతి ఉంటుంది.
- కౌంటింగ్ అధికారులు, సిబ్బంది రేబాక అండర్ పాస్ నుంచి గోపాలపురం రోడ్డు మీదుగా బట్లపూడి విలేజ్ కాలనీ దగ్గర వాహనాలను పార్కు చేసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వాహనాలను గొలగాం గ్రామం పడమరన ఉన్న కల్పనా లేఅవుట్ వైపు అనుమతిస్తారు.
- బట్లపూడి విలేజ్ కాలనీ గుడి ప్రాంగణం వైపు కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది వాహనాలను అనుమతిస్తారు.
- కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఎలక్షన్ కమిషన్ అనుమతించిన మీడియా వాహనాలు మాత్రమే అనుమతిస్తారు.
- కలెక్టరేట్ పక్కనున్న ఖాళీ స్థలంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- కౌంటింగ్ సందర్భంగా సుంకరమెట్ట జంక్షన్ నుంచి రేబాక, జిల్లా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తాం. ప్రజలంతా గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పీ మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనకాపల్లి పరిధిలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను రెండు, మూడేళ్ల వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు, వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ, 55 అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయన్నారు. జిల్లాలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఈ నెల 20వ తేదీ లోపున ఆన్‌లైన్‌లో (angrau.ac.in) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులకు 75:25 నిష్పత్తిలో పదవ తరగతి మార్కుల ప్రామాణికంగా సీట్లు కేటాయింపు జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అనకాపల్లి (ఫోన్ 6304852859, 9966244225, 8977451972)లో కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలన్నారు.

6,7 తేదీల్లో ఎథిక్స్, పర్యావరణ విద్య పరీక్షలు

తుమ్మపాల: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈనెల 6న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 7న పర్యావరణ విద్య పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ ఆయా కళాశాలల్లో నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి బి.సుజాత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలతో పాటు ఈ పరీక్షలు రాయని వారికి మరో సారి అవకాశం కల్పించినట్టు చెప్పారు. ఈ పరీక్షలు తప్పకుండా రాయాలని, రాసినవారికి మాత్రమే ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

తుమ్మపాల: అనకాపల్లి మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 6వ రోజు జరిగిన పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌కు 149 మంది విద్యార్థులు హాజరయ్యారని కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం 75,001 నుంచి 92,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరిగిందన్నారు. బాలురు 47 మంది, బాలికలు 102 మంది హాజరయ్యారని, ఐసీఆర్ పత్రాలు అందించామన్నారు. ఆదివారం 92,001 నుంచి 1,08,000 వ ర్యాంక్ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

అ'ద్వితీయ'ంగా సీబీఎస్ఈ బోధన

పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు అమలు చేస్తోంది. ఒక వైపు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూనే మరో వైపు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా మార్పులు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా గత ఏడాది నుంచి మొదలు పెట్టిన సీబీఎస్ఈ సిలబస్ బోధన 2024–25 విద్యాసంవత్సరంలో రెండో ఏడాదిలోకి అడుగు పెట్టనుంది. ఇప్పటికే 8,9 తరగతుల్లో అమలు చేస్తున్న సీబీఎస్ఈ సిలబస్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు బోధించనున్నారు.



కొక్కిరాపల్లి అంబేద్కర్ గురుకులంలో సీబీఎస్ఈ పాఠాలు నేర్చుకుంటున్న తొమ్మిదో తరగతి విద్యార్థినులు

- గత ఏడాది నుంచి 41 పాఠశాలల్లో అమలు
- మొదటిగా 8,9 తరగతులకు...
- ఈ విద్యా సంవత్సరం నుంచి టెన్త్ పాఠాలు

యలమంచిలి రూరల్: జిల్లాలో ఎంపిక చేసిన 41 పాఠశాలల్లో సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధన విజయవంతంగా సాగుతోంది. గత విద్యా సంవత్సరంలో 41 స్కూళ్లలో 8,9 తరగతుల విద్యార్థులకు ఈ సిలబస్‌ను అమలు చేశారు. ఈ విద్యాసంవత్సరంలో టెన్త్ విద్యార్థులకు ఈ సిలబస్‌లో పాఠ్యాంశాలు బోధించనున్నారు. వీరు వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే సీబీఎస్ఈ బోర్డు పరీక్షలను రాయనున్నారు. అదేవిధంగా గత విద్యా సంవత్సరంలో 7వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈ ఏడాది 8వ తరగతిలోకి ప్రవేశించి సీబీఎస్ఈ సిలబస్ నేర్చుకోనున్నారు. దీంతో 2024–25 విద్యాసంవత్సరంలో ఎంపిక చేసిన అన్ని స్కూళ్లలో 8,9,10 తరగతుల విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ బోధన జరుగుతుంది. ఇందుకు అవసరమైన పుస్తకాలను ముద్రణా సంస్థల నుంచి నేరుగా ఆయా పాఠశాలల విద్యార్థులకు చేరనున్నాయి. నాడు–నేడుతో పాటు గత ఐదేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు,సంస్కరణలు తీసుకొచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2023–24 విద్యాసంవత్సరంలో జిల్లాలో తొలి విడతగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తోంది. ఈ సిలబస్‌ను నేర్చుకోవడం వల్ల విద్యార్థులు జేఈఈ,నీట్ తరహా పోటీ పరీక్షలకు సులభంగా సన్నద్ధమవగలుగుతారన్నది ప్రభుత్వ ఆలోచన. ఇప్పటివరకు కార్పొరేట్,ప్రైవేట్ స్కూళ్లలో మాత్రమే ఈ సిలబస్‌ను బోధించేవారు.

500 మంది టీచర్లకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలో 41 స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న 500 మంది సబ్జెక్టు టీచర్లను రెండు బ్యాచ్‌లుగా విభజించి ఇటీవల శిక్షణనిచ్చారు. 8,9 తరగతుల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో విద్యాబోధన అందించడంతో పాటు 10వ తరగతిలో మారిన సిలబస్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యాబోధన అందించేలా గణితం,ఫిజికల్ సైన్స్,బయలాజికల్ సైన్స్,సోషల్ స్టడీస్,ఇంగ్లిష్ ఉపాధ్యాయులందరికీ నిష్ణాతులైన శిక్షకులతో ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు.సీబీఎస్ఈ సిలబస్ అమలవుతున్న పాఠశాలలన్నీ రెండెకరాలు,అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి.ఈ స్కూళ్లలో బోధన అత్యాధునికంగా ఉంటుంది.ఆరో తరగతిలో చేరితే 12వ తరగతి వరకూ చదువుకోవచ్చు.ప్రతి తరగతికి నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తారు. అత్యాధునికమైన సైన్సు ల్యాబ్‌లు,ఆటస్థలాలు ఉంటాయి.

సీబీఎస్ఈ సిలబస్ ప్రయోజనాలు

సీబీఎస్ఈ పుస్తకాలు ఆసక్తిగా విద్యార్థులకు అర్థమయ్యేలా ఉంటాయి.కోర్సుల నిర్మాణం ఒత్తిడికి గురిచేయదు.విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది.వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపేందుకు దోహదపడతాయి.యాంత్రిక విద్యకు దూరంగా ఉంటూ వాస్తవాలకు దగ్గరగా బోధిస్తారు.పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతానికి పెద్దగా ప్రాధాన్యత కల్పించరు.ఏ మేరకు సబ్జెక్టు నేర్చుకున్నారో పరీక్షించేలా ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు.ఫలితాలు అనుకూలంగా వస్తాయి. జాతీయస్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థి రాణించేలా సీబీఎస్ఈ సిలబస్ ప్రణాళిక ఉంటుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



పోటీ ప్రపంచంలో విద్యార్థులు సామర్థ్యాన్ని పెంచుకుని జాతీయ పరీక్షలకు హాజరు కావడానికి సీబీఎస్ఈ సిలబస్ దోహదపడుతుంది.సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం.ఈ సిలబస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దేశంలో వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న సీబీఎస్ఈ సిలబస్ బోధన జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లలో విజయవంతంగా అమలవుతోంది.మారిన సిలబస్‌పై ఉపాధ్యాయులకు ఇటీవల శిక్షణ పూర్తయింది.

– ఎం.వెంకటలక్ష్మమ్మ,డీఈవో

ఎన్టీఆర్ వైద్యాలయంలో శిక్షణకు పీజీ విద్యార్థులు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో శిక్షణ పొందేందుకు రాష్ట్రంలో వివిధ మెడికల్ కళాశాలల నుంచి పది మంది పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వచ్చినట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు శనివారం చెప్పారు. వైద్య విద్యార్థులు పీజీ చదువుతున్న సమయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో మూడు నెలలు శిక్షణ పొందాలని ఆయన తెలిపారు. వైద్యాలయంలో సీటీ స్కానింగ్ మిషన్ టెక్నీషియన్ పోస్టు భర్తీకి ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో ఈ పోస్టును భర్తీ చేయనున్నట్టు తెలిపారు.

అల 'జడి వాన'

- మెరుపులు, పిడుగులు, ఈదురుగాలులు
- పలుచోట్ల నేల కూలిన చెట్లు
- గాజువాకలో 6 సెం.మీల వర్షపాతం నమోదు

సాక్షి, విశాఖపట్నం: శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు కురిసిన వాన అలజడి రేపింది. పిడుగులు, ఈదురుగాలులు కూడా తోడయ్యాయి. ఫెళఫెళమంటూ శబ్దాలు చేస్తూ పిడుగులు ఒకపక్క, కుండపోత వర్షం మరోపక్క వెరసి ఉమ్మడి విశాఖ జిల్లాను తడిసి ముద్ద చేశాయి. పిడుగుల శబ్దాలకు నిద్రలో ఉన్న వారు ఉలికిపాటుకు గురయ్యారు. మరోవైపు ఈదురుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. కొన్నిచోట్ల రోడ్లపై చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెనువెంటనే వీటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షం కొనసాగింది. ఉదయం తర్వాత విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ వాన అక్కడక్కడ కురిసింది. ఇలా శనివారం ఉదయం 8.30 గంటల వరకు అనకాపల్లి జిల్లా కె.కోటపాడులో 7.5 సెం.మీల భారీ వర్షపాతం నమోదైంది. ఇంకా గాజువాకలో 6 సెం.మీలు, కాపులుప్పాడలో 5.8, పరవాడలో 5.4, ఎస్.రాయవరంలో 5.2, గోపాలపట్నంలో 5, సింహాచలంలో 4.3, పెందుర్తిలో 4.2, నర్సీపట్నంలో 3.3 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. కాగా రానున్న మూడు రోజులు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పడతాయని పేర్కొంది.

అనకాపల్లి/మునగపాక: జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం వర్షం కురిసినట్టు ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ శనివారం చెప్పారు. వరి, ఇంతర పంటలు పండించే రైతులు సకాలంలో నేలను చదునుచేసుకుని పచ్చిరొట్ట, జనుము, పిల్లిపెసర విత్తనాలు జల్లుకుని నేలను సారవంతం చేయాలని ఆమె సూచించారు.

మునగపాక మండలంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. మునగపాక మెయిన్‌రోడ్డులో చర్చి ఎదుట చెట్లపై విద్యుత్ వైర్లపై పడ్డాయి.దీంతో తెల్లవారు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆర్ఈసీఎస్ ఉద్యోగులు మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు.



మునగపాక మెయిన్‌రోడ్డులో నేలకొరిగిన చెట్టు

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అనకాపల్లి: సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈనెల 8వ తేదీ వరకూ జరగనున్నాయని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. మొదటి రోజు పదో తరగతి పరీక్షలకు 244 మంది, ఇంటర్మీడియెట్ తెలుగు/హిందీ పరీక్షకు 282 మంది హాజరైనట్టు తెలిపారు. యలమంచిలి మండలం కొత్తపేట, చోడవరం, అచ్యుతాపురం ప్రభుత్వ హైస్కూళ్లలో టెన్త్ పరీక్షలు, అనకాపల్లి గవరపాలెం చిన్న హైస్కూల్, మెయిన్‌రోడ్డులో పెద్ద హైస్కూల్, యలమంచిలి, చోడవరం, సబ్బవరం, ఆరిపాక హైస్కూళ్లలో ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. మొదటి రోజు సబ్బవరం, ఆరిపాక పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్టు ఆమె తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టిపోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

79 శాతం మందికి పింఛన్ల పంపిణీ



అనకాపల్లి వేల్పులవీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయం ఉద్యోగులు



అనకాపల్లి కోట్నీవీధిలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయం ఉద్యోగి

తుమ్మపాల/మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట: జిల్లాలో మొదటి రోజు శనివారం సచివాయల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 79 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి తెలిపారు. జిల్లాలో మొత్తం 71,171 మంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయవలసి ఉండగా 56,606 మందికి పంపిణీ చేశామని చెప్పారు. మాడుగుల మండలంలో 3,008 మందికి గాను తొలిరోజు 2,141 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు స్థానిక ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు తెలిపారు. చీడికాడ మండలంలో 2,326 మందికి గాను 1,870 మందికి, కె.కోటపాడు మండలంలో 3,386 మందికి గాను 2,809 మందికి, దేవరాపల్లి మండలంలో 2,707 మందికి గాను 2,010 మందికి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఆయా మండలాల ఎంపీడీవోలు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలంలో 10,813 మందికి ప్రభుత్వం జూన్ నెల పింఛన్ నగదు విడుదల చేసినట్టు ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు.

క్లుప్తంగా

సిరులతల్లికి తులసీదళార్చన

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

విశాఖ సిటీ: డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ సీపీ ఫకీరప్ప పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 17 మంది ఫిర్యాదుదారులు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అలాగే వృద్ధుల కోసం మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. వాటిపై జేసీపీ వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని చెప్పారు.

కళాశాల.. కళకళ

- తెరుచుకున్న జూనియర్ కాలేజీలు
- ప్రారంభమైన ఇంటర్ తరగతులు
- టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణతతో కోర్సులకు డిమాండ్
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల జోరు
- తొలి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 366 జూనియర్ కాలేజీలు
- గతేడాది 58,944 మంది విద్యార్థులు చేరిక
- వార్షిక విద్యా క్యాలెండర్ ఖరారు

విశాఖ విద్య: చదువుల కాలం మళ్లీ మొదలైంది. 2024–25 విద్యా సంవత్సరం వార్షిక క్యాలెండర్ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు శనివారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. తొలిరోజు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల, తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించారు. ఏడాది చదువులు సవ్యంగా సాగేలా విద్యార్థులతో పాటు, తల్లిదండ్రుల పాత్రను ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు వారికి వివరించారు. సప్లిమెంటరీ పరీక్షలు ముగియడంతో సోమవారం నుంచి అన్ని జూనియర్ కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన సైతం ప్రారంభించేందుకు కాలేజీల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటర్మీడియెట్ చదువుల ప్రాధాన్యత దృష్ట్యా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ప్రభుత్వం ఈసారి ముందుగానే ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగేలా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 39 ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ -11, ట్రైబర్ వెల్ఫేర్ -10, కేజీబీవీ -34, బీసీ వెల్ఫేర్ -2 మోడల్ జూనియర్ కాలేజీలు -5, హైస్కూల్ ప్లస్ -16 , ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 246 కాలేజీలు ఉన్నాయి. ఎయిడెడ్, ఇన్సెంటివ్, కార్పొరేట్ యాజమాన్యాల పరిధిలో ఒక్కో కాలేజీ ఉన్నాయి. వీటి పరిధిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఫస్టియర్‌లో మూడు జిల్లాల్లో 58,944 మంది ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరారు. టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణత రావడంతో ఈ ఏడాది అడ్మిషన్లు 60 వేలకు పైగానే ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

పక్కాగా విద్యా క్యాలెండర్

2024–25 విద్యా సంవత్సరంలో 222 రోజులు కాలేజీలు పనిచేసేలా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన మొదలుపెట్టారు. జులై 29 నుంచి 31 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 29 నుంచి 31 వరకు సెకెండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ సెప్టెంబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు.

దసరా సెలవులు అక్టోబర్ 3 నుంచి 11 వరకు ఉంటాయి.మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 23 వరకు జరుగనున్నాయి. నాల్గో యూనిట్ పరీక్షలు నవంబర్ 21 నుంచి 23 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలు డిసెంబర్ 16 నుంచి 231వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2025 జనవరి 13 నుంచి 18 వరకు ఇస్తారు. ప్రీ ఫైనల్ ఫిబ్రవరి 3 నుంచి 10 వరకు, వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా క్యాలెండర్‌ను ప్రకటించారు.

అమ్మఒడితో ఉన్నత చదువుల వైపు..

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ. 15 వేలు అందుతుండటంతో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువుల వైపు వస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాడు–నేడు పథకం ద్వారా మౌలిక సౌకర్యాలు పెంపొందడంతో ఈ ఏడాది అడ్మిషన్లు పెరుగుతాయని కాలేజీల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. మరో పక్క ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులు సైతం ఫలితాల తరువాత ఇంటర్మీడియెట్‌లో చేరనున్నారు. ఈ మొత్తం పరిణామాల్లో జూనియర్ కాలేజీలో విద్యార్థుల సందడి మొదలైంది.



విశాఖలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ

అడ్మిషన్ల పెంపునకు ప్రత్యేక దృష్టి



2024–25 విద్యా క్యాలెండర్ ప్రకారం శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. స్పాట్ వ్యాల్యూషన్ కూడా సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. భవిష్యత్ చదువులకు ఇంటర్మీడియెట్ తొలి మెట్టు అయినందున, నాణ్యమైన విద్య అందించేలా కాలేజీలపై పర్యవేక్షణ పెంచుతాం.

– మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత



చెర్లోపాలెంలో ఆంజనేయస్వామికి తల్లిదండ్రులతో కలిసి పూజలు చేస్తున్న సినీ నటుడు జోగినాయుడు



నాతవరంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న పైల పోతురాజు, నాయకులు

- సినీ నటుడు జోగినాయుడు

నాతవరం : గ్రామాల్లో ప్రజలకు భక్తిభావం పెరిగితే ప్రశాంత వాతావరణం నెలకొంటుందని సినీ నటుడు ఎల్. జోగినాయుడు అన్నారు. ఆయన స్వగ్రామమైన చెర్లోపాలెంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద తల్లిదండ్రులతో కలిసి శనివారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం హనుమాన్ విగ్రహం వద్ద భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ప్రతి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు సంక్రాంతి పండగను తలపించేలా భక్తులు చేయడం ఆనందం కలిగిస్తుందన్నారు. ఎక్కడైతే ప్రజలు దేవుని పూజిస్తారో ఆయా కుటుంబాల్లో తమ పిల్లలు ఆశించిన రంగాల్లో అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా మండల కేంద్రం నాతవరంలో రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతురాజు ఆధ్వర్యంలో ఎం.బెన్నవరంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, రాజుపేట అగ్రహారంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడపర్తి అచ్చియ్యనాయుడు, డి.యర్రవరంలో వైఎస్సార్‌సీపీ నేత పారుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న అంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణీ, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, నాతవరం నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు,

కమనీయం.. కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు, నిత్య కల్యాణం వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

● శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

రవాణా కార్యాలయంలోనే డీఎల్ పొందాలి

గోపాలపట్నం: రవాణా కార్యాలయంలోనే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని.. డ్రైవింగ్ స్కూళ్లలో ఆ సదుపాయం లేదని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జూన్ 1 నుంచి డ్రైవింగ్ స్కూళ్లలో డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చని, రవాణా కార్యాలయాలకు వెళ్లే పనిలేదని వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లకు స్లాట్లు బుక్ చేసుకుని.. రవాణా శాఖ కార్యాలయాల్లో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. మోటార్ వాహన చట్టం సెక్షన్–12ను అనుసరించి డ్రైవింగ్ స్కూళ్లకు కూడా ప్రభుత్వ గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. అక్రిడేటెడ్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ (ఏడీటీసీ) గుర్తింపు పొందడానికి కనీసం ఎకరా స్థలం(టూ వీలర్, త్రీ వీలర్, లైట్ మోటార్ వాహనాలు) ఉండాలని, మీడియం, భారీ వాహనాలకు కనీసం రెండు ఎకరాల స్థలం ఉంటేనే ఆయా సంస్థలకు గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. వీటితో పాటు రెండు తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రాజెక్ట్ సిస్టమ్, బ్రాడ్ బ్యాండ్ సదుపాయం, డ్రైవింగ్ ట్రాక్‌లు, డ్యూయల్ కంట్రోల్‌తో ఓ వాహనం తదితర మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. వర్క్‌షాప్‌లో వాహనం విడి భాగాలు ప్రదర్శించాలని సూచించారు. తర్ఫీదు పొందిన బోధకులు, తగిన స్టాఫ్, వాహనాలకు బీమా సౌకర్యం ఉండాలన్నారు. ఈ నిబంధనలు పాటించిన సంస్థలకు గుర్తింపునిస్తామని స్పష్టం చేశారు. 2021 జూలై ఒకటో తేదీన కేంద్రం ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇంతర వరకు రాష్ట్రంలో ఒక్క దరఖాస్తు అందలేదని, సారథి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే అన్ని పరిశీలించి గుర్తింపు మంజూరుచేస్తామని వివరించారు.

8న మెగా జాబ్‌మేళా

సీతంపేట: అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్, విశాఖ ముస్లిమ్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా ఈ నెల 8వ తేదీన అక్కయ్యపాలెం అబిద్‌నగర్ హైవేరోడ్‌లో గల షాదీఖానా కల్యాణ మండపంలో మెగా జామ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రహమతుల్లాబేగ్ తెలిపారు. ఆరోజు 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి, 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. హాజరు కాదలచిన వారు 5 రెజ్యూమ్, 5 పాసుపోర్టు ఫొటోలు తీసుకురావాలన్నారు. www.tinyurl.com/ AMPjobDrive2024 వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 98481 95722 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

మామిడి పండ్ల సంతకు స్పందన



మామిడి పండ్లను కొనుగోలుదారుల హడావిడి

ఎంవీపీకాలనీ: సహజ సిద్ధంగా పండించిన మామిడి పండ్లను విక్రయించేందుకు ఎంవీపీ కాలనీలో ప్రత్యేక సంతను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీకాలనీలోని గిరిజన భవన్ వేదికగా ఈ సంత జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు సంతకు తరలివచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేశారు. విశాఖ గ్రామీణ ప్రాంతాలతో పాటు పలు చోట్ల ప్రకృతి వ్యవసాయం ద్వారా మామిడి పండ్లను పండించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రతినిధి పీఎల్ఎన్ రాజు తెలిపారు. మరికొన్ని రోజులు విక్రయాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

3న విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా కొన్ని రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్ల రీషెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

రద్దు చేసిన రైళ్లు

ఆదివారం కొయంబత్తూర్–సిల్చార్(12515) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జూన్ 3న పలాస–విశాఖపట్నం–పలాస(07471/07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, 4న బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

పూరి–గుణుపూర్ (18417) గంట ఆలస్యంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు, విశాఖపట్నం–కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.45గంటలకు, యశ్వంత్‌పూర్–పూరి (22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 2.20 గంటలు ఆలస్యంగా మధ్య రాత్రి ఒంటి గంటకు, హౌరా–ఎర్నాకుళం (22877) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 2గంటలు ఆలస్యంగా సాయంత్రం 5గంటలకు, షాలిమర్ -చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా సాయంత్రం 4.25 గంటలకు బయలుదేరింది.

- జూన్ 2న రాత్రి 11.40 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్–సంత్రగచ్చి (07234) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా 3వ తేదీ తెల్లవారు 3.10 గంటలకు బయలుదేరుతుంది.
- జూన్ 3వ తేదీ తెల్లవారు 4.30 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్–షాలిమర్ (07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా తెల్లవారు 5.30 గంటలకు బయలుదేరుతుంది.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పదవీ విరమణ చేసిన అధికారులకు సత్కారం



డీపీఆర్‌వో సాయిబాబా, డీఎంహెచ్‌వో హేమంత్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల : విధి నిర్వహణలో బాధ్యతయుతంగా సేవలందించి ఈ నెల 31న పదవీ విరమణ చేసిన డీపీఆర్‌వో సాయిబాబా, డీఎంహెచ్‌వో హేమంత్‌ను అభినందిస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో పదవీ విరమణ కార్యక్రమంలో కలెక్టర్ ఇద్దరు అధికారులను సత్కరించి అభినందించారు. జిల్లాలో ప్రధాన శాఖలైన వైద్య ఆరోగ్య శాఖ, సమాచార శాఖల ద్వారా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. వారి సేవలను మిగిలిన అధికారులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి, జెడ్పీ సీఈవో పోలీనాయుడు, డ్వామా పీడీ సందీప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చోడవరంలో 52 వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

చోడవరం రూరల్: కార్డన్ సెర్చ్‌లో భాగంగా శనివారం 52 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని చోడవరం– చీడికాడ రోడ్డులో ఐటీఐ కాలనీ వద్ద చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలో సరైన రికార్డులు లేని 51 ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రికార్డులు చూపిన వారికి వాహనాలు అప్పగించారు. తనిఖీల్లో ఎస్ఐలు సూర్యనారాయణ, శేఖరం సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని గిరిజన మహిళ మృతి

నర్సీపట్నం : మున్సిపాలిటీ పీనారపాలెం కల్పన థియేటర్ వద్ద లభించిన గిరిజన మహిళ మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా వున్నాయి. లభ్యమైన మహిళ మృతదేహం జి.మాడుగుల మండలం, గోడ్డుపాలెం గ్రామానికి చెందిన జి.లక్ష్మిగా సోదరి వి. పుష్ప గుర్తించింది. మృతురాలు ఏడేళ్లుగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. వారం రోజుల క్రితం మృతురాలు ఊరు నుండి వచ్చేసింది. కల్పన థియేటర్ వద్ద మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఆమె బంధువులకు అప్పగించామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

క్లుప్తంగా

[illegible] రథయాత్రలో [illegible] ప్రారంభోత్సవం'

[illegible] 16 వరకు [illegible] రథయాత్ర సందర్భంగా స్వామివారి దర్శనంలో వచ్చే [illegible] జరుగుతున్నాయని పేర్కొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : పట్టణంలో ఆదివారం 4వ వార్డు నుంచి 19 వార్డులకు 25వ వార్డుకు మంచినీటి సరఫరా ఉండదని ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి ప్రభాకర్రావు విలేకరులకు తెలిపారు. పట్టణానికి నీటి సరఫరా జరిగే సోముదేవపల్లి హెడ్ వాటర్ వర్క్సుకు శనివారం విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఇబ్బంది తలెత్తిందని ఆయన చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తమకు సహకరించాలని ఆయన కోరారు.

మత్స్యకారులకు ద్విచక్ర వాహనాల పంపిణీ



మత్స్యకారులకు అందజేసిన టీవీఎస్ వాహనాలు

అచ్యుతాపురం : మత్స్యకారులకు అండగా ఉంటామని రామ్ కీ ఫౌండేషన్ ఎం.వి రామిరెడ్డి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవ వద్ద నిర్వహించిన రీ సస్టెయిన బులిటీ లిమిటెడ్ సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 మంది మత్స్యకారులకు 16 టీవీఎస్ ద్విచక్ర వాహనాలు అందజేశారు. వలలు దాచుకునేందుకు నిర్మించిన షెడ్ను ప్రారంభించారు. రీ సస్టెయిన్బులిటీ జనరల్ మేనేజర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ 300 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్న కొండకర్ల, వాడ్రాపల్లి ప్రాంతంలో సస్టెయిన్ బులిటీ లిమిటెడ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 31 ద్విచక్ర వాహనాలు, నాలుగు పడవలు, ఆర్థిక సహాయం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, మహేంద్ర బాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్ మీ	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్కు శనివారం 191 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	5,140
రెండో రకం	3,970	4,400
మూడో రకం	3,500	4,100

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 378 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



అంజయ్య కాలనీలో అంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



కేఎన్ఆర్పేటలో తమలపాకులతో హనుమాన్కు పూజలు



పట్టణంలో లక్ష్మీదేవిపేటలో హనుమాన్ ఆలయంలో కమిటీ సభ్యులు



చింతలపాలెంలో అభయాంజనేయస్వామికి పూజలు



చేపలబజార్ సీతారాముల ఆలయంలో హనుమాన్కు ప్రత్యేక పూజలు చేసిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్కుమార్

అనకాపల్లి : పట్టణం, మండలంలో పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం జరిగాయి. తెల్లవారు జాము నుంచి హనుమాన్ దేవాలయాల్లో భక్తులు తాకిడి పెరిగింది. హనుమాన్కు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, సుప్రభారత సేవ, పంచామృతాభిషేకాలు, నిత్యపూజలు, తమలపాకులతో అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ పరిధిలో మల్లిమణుగుల వారివీధి, అంజయ్యకాలనీ, వేల్పులవీధి, లక్ష్మీదేవిపేట, రింగ్రోడ్డు, గవరపాలెం, పార్కుసెంటర్, దిబ్బవీధి, చాకలిపేట, శారదానగర్, మండలంలో ముత్రాస్కాలనీ, కొత్తూరు, కెఎన్ఆర్పేట, తుమ్మపాల, మామిడిపాలెం, బవులవాడ, అక్కిరెడ్డిపాలెం, కొత్తతలానివానిపాలెం, గొలగాం, రేబాక, శంకరం తదితర హనుమాన్ దేవాలయాల్లో హనమాన్ జయంతి వేడుకలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్ని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలు వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు.

పట్టణంలో చేపలు బజారు వద్ద...

స్థానిక మెయిన్స్రోడ్డు చేపలు బజారు సీతారాములవారి ఆలయంలో ఆంజనేయస్వామిని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు భరత్కుమార్ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని పలు హనుమాన్ ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రిక్షా స్టాండ్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయాన్ని భక్తులు ఎక్కువగా సందర్శించారు. పూజలు చేశారు. ప్రసాద వితరణ చేశారు. నెరసావర్జుల శర్మ, యువ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కస్పావీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి ఆలయం, గవరపేటలోని ఆంజనేయస్వామి ఆలయం, కనకమహాలక్ష్మి వీధిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో సింధూరంతో అర్చించి తమలపాకు మాలలు, నిమ్మకాయల మాలలు అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు.

అలాగే మండలంలోని చింతలపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయంలో రేజేటి మారుతి ఆధ్వర్యంలో వేద పండితులు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన సోమవరం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ప్రారంభించారు. పేరంటాలపాలెం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం, బయ్యవరం, జి. భీమవరం, తాళ్లపాలెం, తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో కూడా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



కశింకోటలోని రిక్షా స్టాండ్ వద్ద అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మండలంలో కెఎన్ఆర్పేటలో అంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం

15,16,17 తేదీలలో రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు

తుమ్మపాల : దేశంలో వ్యవసాయ భూమికి సాగునీటి సమస్యలను పరిష్కరించడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయని, వ్యవసాయదారిత పరిశ్రమలైన షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలను మూసివేస్తూ, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను దక్కనివ్వకుండా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై పెత్తనాన్ని బహుళజాతి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని రాష్ట్ర రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు అన్నారు. రైతాంగ, గిరిజన, పీడిత ప్రజల హక్కుల కోసం గత 4 దశాబ్దాలుగా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను జూన్ 15, 16,17 తేదీలలో ఏలూరులో నిర్వహిస్తున్నట్లు, ఈ మహాసభలకు జిల్లాలోని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పేద ప్రజానీకమంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా కమిటీ, జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్లో కార్మిక, రైతు కూలీ సంఘాల నాయకులు గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి.జగదీశ్వరరావు, మరిసా సతీష్, క్వారీ కార్మిక సంఘం నాయకులు గడి.సూర్యారావు, ఎస్.సూరిబాబు, డి.జగ్గారావు, సిహెచ్ రమేష్, గొరప్రల్లి సన్యాసి రావు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు

తుమ్మపాల : నేటి బాలలే రేపటి పౌరులని, బాలలకు సమాజం, దేశం పట్ల గౌరవం పెరిగే విధంగా తీర్చిదిద్దాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. చినరాజుపేట సాంబశివ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన భారత జాతీయ జెండా చిత్రలేఖనం పోటీలలో ఆయనతో పాటు ప్రముఖ శిల్పి కళాకారులు పండూరి సత్యనారాయణ బాలలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ బాలలకు విద్యతో పాటు సమాజంలో బాధ్యతలపై కూడా అవగాహన చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలలను ప్రోత్సహించేందుకు చేపట్టిన పోటీల్లో 35 మంది బాలలు హాజరై ప్రతిభ కనబరిచారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, ఉజ్జి సత్యనారాయణ పాల్గొన్నారు.



బాలలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు

21 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల : వాళ్లంతా నిక్కర్లు వేసుకునే కాలంలో విడిపోయారు. ఒకరి ముఖాలు ఒకరు మరిచిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఇపుడు మళ్లీ 21 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకుంటూ గుర్తుపట్టినట్టుగా నటిస్తూ.. ఆప్యాయంగా పలకరించుకున్నారు. వీరంతా కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్లో 2002-2003లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు. అదే పాఠశాలలో శనివారం కలుసుకున్నారు. వారి ఆత్మీయ సమ్మేళనంతో పాఠశాల ఆవరణ పరవశించింది. ఆనాటి తీపి గుర్తులు, గురువుల బెత్తం దెబ్బలు, తొడపాశాలను గుర్తుకు తెచ్చుకుని మనసారా నవ్వుకున్నారు. ఇపుడున్న సాధక బాధకాల నుంచి కాసేపు ఉపశమనం పొంది మళ్లీ చిన్న పిల్లల్లా మారిపోయారు. తమకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పచ్చార అర్జునరావు, ఎం.నాగేష్, గోవిందు, జయబాబు ఆర్గనైజ్ చేయగా పాఠశాల హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు రాజు, ప్రసన్నకుమార్, జె.వి.ప్రసాదరావు, కనకారావు, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థులు

సరైన పత్రాలు లేని 31 వాహనాలు స్వాధీనం

పెదపల్లిలో పోలీసుల కార్డన్ సెర్చ్

యలమంచిలి : సరైన పత్రాలు లేని వాహనాల తనిఖీల్లో భాగంగా యలమంచిలి సీఐ షేక్ గఫూర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పెదపల్లి విధుల్లో వచ్చే వాహనాలు, ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తనిఖీలు చేసి వాహనాలు పత్రాలు, రికార్డులు పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని యలమంచిలి సర్కిల్ కార్యాలయానికి తరలించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగం గ్రామాల్లో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపడుతున్నామని సీఐ షేక్ గఫూర్ అన్నారు. ఈ కార్డన్ సెర్చ్ కార్యాక్రమంలో యలమంచిలి రూరల్ ఎస్సై పి.సింహాచలం, పట్టణ ఎస్ఐ కె. పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీన పరుచుకున్న మోటార్ వాహనాలు

కళాశాల కరస్పాండెంట్పై కోర్టు ధిక్కరణ పిటిషన్

కశింకోట : కశింకోటలోని పూర్వ ఆర్ఈసీఎస్లోని రాజీవ్గాంధీ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్, జిల్లా సహకార రిజిస్ట్రార్ అధికారిపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసినట్టు కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమాశంకర్ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో అక్రమాలకు సహకరించని కారణంగా లేనిపోని ఆరోపణలు చేసి తనను అన్యాయంగా 2022లో ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. విద్యా చట్టం ప్రకారం ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల వ్యవహారాలపై దర్యాప్తునకు ఆదేశించే అధికారం సాంకేతిక విద్యాశాఖ కమిషనర్కు మాత్రమే ఉందని, అయితే డిప్యూటీ రిజిస్ట్రార్ హోదా కలిగిన జిల్లా సహకార అధికారితో దర్యాప్తు చేయించి తనను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా, ఉద్యోగంలో తిరిగి నియమించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే కోర్టు ఆదేశాలు అమలు చేయలేదని, దీంతో కోర్టు ధిక్కరణ కేసు వేశామన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ

నర్సీపట్నం: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఒక రోజు తరగతులు నిర్వహించారు. విద్యాశాఖాధికారులు సీహెచ్ తలుపులు, జీవీఎస్ నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించటంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల పాత్ర కీలకమన్నారు. రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భోజనం తయారీలో ప్రతిభ కనబరిచిన నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి జెడ్పీ హైస్కూల్ పెదబొడ్డేపల్లి, ద్వితీయ బహుమతి జెడ్పీ బాలికోన్నత పాఠశాల వేములపూడి, తృతీయ బహుమతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నీలంపేట నిర్వాహకులకు వచ్చింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ప్రసన్న, డాటా ఎంట్రీ ఆపరేటర్ పట్నాల సతీష్, జిల్లా అబ్జర్వర్ హేమచంద్ర, సీఆర్పీలు పూడి వెంకట్రావు, లోకేష్, రామలక్ష్మి, ధారలక్ష్మి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి..

కె.కోటపాడు : ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు అన్నారు. కె.కోటపాడు మండలంలో గల 51 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని కె.కోటపాడు హైస్కూల్లో ఇచ్చారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవడంతో పాటు వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రుచికరమైన ఆహారం తయారు చేసిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల అధ్యాపకురాలు మహాలక్ష్మి, ఎంఈవో 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు సూర్రెడ్డి శ్రీనివాస్, పోతల నాయుడు, నరసింహమూర్తి, ఎండీఎం రీసోర్స్పర్సన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షల నాబార్డు నిధులతో గోదాం

- 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం
- రైతులకు ఎంతో ఉపయోగం

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామం వద్ద రైతులకు ప్రయోజనం కలిగించే బహుళ ప్రయోజన సౌకర్య గోదాం నిర్మించారు. ఇందుకు రూ.40 లక్షల నాబార్డు నిధులు సమకూర్చింది. రైతులు పండించిన ఉత్పత్తులను ఇక్కడ నిల్వ ఉంచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించుకోవడానికి దీనివల్ల అవకాశం కలగనుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం జిల్లాలో మొదటి విడతగా ఒక్కొక్కటి రూ.40 లక్షలతో 9 బహుళ ప్రయోజన సౌకర్య గోదాంలను మంజూరు చేసింది. దీనిలో భాగంగా మండలంలోని జమాదులపాలెం వద్ద గోదాం మంజూరైంది. దీనికి ప్రభుత్వం నుంచి ఎకరం భూమిని సమకూర్చింది. నాబార్డు నుంచి ఆప్కాబ్ ద్వారా సమకూర్చిన రుణంతో దీన్ని నిర్మించారు. 500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు నిల్వ ఉంచుకోవడానికి అనువైన సామర్థ్యంతో నిర్మాణం పూర్తి చేశారు. దీనిలో నిల్వ ఉంచుకొనే ఉత్పత్తులకు రైతుల నుంచి పరిమాణం, నిబంధలు అనుసరించి వసూలు చేసే అద్దెతో గిడ్డంగి నిర్మాణానికి సమకూర్చిన నిధుల్లో రూ.35 లక్షలు 4 శాతం వడ్డీతో 30 ఏళ్లలో రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది. కశింకోట పీఏసీఎస్ ద్వారా రుణం చెల్లించాల్సి ఉంటుంది. ఈ గిడ్డంగి వల్ల చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తమ ఉత్పత్తులు తెచ్చుకొని నిల్వ ఉంచుకోవడానికి అవకాశం కలగనుంది. ధర తక్కువగా ఉన్నప్పుడు నామమాత్రపు అద్దె చెల్లించి వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ నిల్వ ఉంచుకుంటారు. ధర ఎక్కువ పలికినప్పుడు ఉత్పత్తులను మార్కెట్కు తరలించి గిట్టుబాటు ధర పొందడానికి అవకాశం కలగనుంది. దీనికి విద్యుత్ సదుపాయం కల్పించడంతోపాటు రక్షణగా ప్రహరీ నిర్మాణం, పూర్తి స్థాయిలో రోడ్డు వంటి సదుపాయాలు కూడా అదనంగా కల్పిస్తే మరింత సౌకర్యవంతంగా ఉండగలదని రైతులు అంటున్నారు. గిడ్డంగిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు ప్రారంభించారు. బహుళార్థ ప్రయోజనాలకు ఉపయోగకరంగా గిడ్డంగి నిర్మించడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జమాదులపాలెంలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్యాల గోదాం

నామమాత్రపు అద్దె

జమాదులపాలెం వద్ద ప్రభుత్వం స్థలం సమకూర్చడంతో ఎకరం స్థలంలో రూ.40 లక్షలు వెచ్చించి బహుళ ప్రయోజన సౌకర్య గిడ్డంగిని నిర్మించాం. దీనివల్ల ఈ ప్రాంత రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచుకోవడానికి, అవసరమైనప్పుడు విక్రయించుకోవడానికి అవకాశం కలగనుంది. ఇందుకు పరిమాణం అనుసరించి నామమాత్రపు అద్దె వసూలు చేస్తారు.

–ద్వారపురెడ్డి నూకేశ్వరరావు, సీఈవో, పీఏసీఎస్, కశింకోట.

అందుబాటులో విద్యాకానుక కిట్లు

మునగపాక : ఈ ఏడాది విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. శనివారం ఎంఆర్సీ భవనానికి చేరుకున్న పుస్తకాలకు సంబంధించిన రికార్డులు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నాటికి విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. విద్యాకానుక కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఈవో-2 శివ నాయుడు, సీఆర్పీలు అచ్యుతకృష్ణ, కర్రి లక్ష్మీనారాయణ, జి.నూకేష్, సత్తిబాబు, గోవింద, వీరప్పారావు, రామలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

మైదాపిండి లోడు లారీ బోల్తా

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి-రామ్నగర్ హైవే సమీపంలో శనివారం ఒక లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఒడిశా నుంచి విజయవాడకు మైదా పిండి బ్యాగ్ల లోడుతో వెళుతున్న లారీని యలమంచిలి పెదపల్లి జంక్షన్ సమీపం వద్దకు ఉదయం 10.30 గంటల సమయంలో వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ హైవే పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీలు కొట్టి సమీపంలో ఉన్న కాలువలో పడిపోయింది. ఈ లారీలో ప్రయాణిస్తున్న డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. లారీ క్యాబిన్లో చిక్కుకున్న డ్రైవర్ను క్లీనర్ను స్థానికులు హుటాహుటిన బయటకు తీసి యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదని స్థానికులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.



పెదపల్లి-రామ్నగర్ హైవే సమీపంలో బోల్తాపడిన లారీ

కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించే బాధ్యత అధికారులదే

ఆర్వో గీతాంజలి

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 4వ తేదీన జరిగే కౌంటింగ్కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్వో గీతాంజలి తెలిపారు. శనివారం ఆమె వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర రెవెన్యూ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించే బాధ్యత అధికారులదేనన్నారు. అనకాపల్లి జిల్లాకలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న కళాశాలలో పాయకరావుపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. 22 రౌండ్లలో ఓటర్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారన్నారు. లెక్కింపు కోసం నియమితులైన వీఆర్వోలు, కార్యదర్శులు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది అంతా కౌంటింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. వారికి కేటాయించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూములనుంచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చే సమయంలో సిబ్బంది కీలక పాత్రపోషించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా పారదర్శకంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. నాలుగో తేదీ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలుతోపాటు, భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. లెక్కింపు అనంతరం ఫలితాలు వెలువడిన సమయంలో గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు, బాణా సంచా కాల్చడం వంటివి నిషేధించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన పాస్లు కలిగిన వారు, ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రాల వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు రచ్చితంగా పాటించాలన్నారు. నక్కపల్లి ప్రభుత్వ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్లను భద్రపరచడం జరిగిందని, వీటిని భారీ బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, హెచ్ డీటీలు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.



సిబ్బందిని ఉద్దేశించిమాట్లాడుతున్న ఆర్వో గీతాంజలి